క్లుప్తంగా

20న రుషి పంచమి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఈ నెల 20న రుషి పంచమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బూర్లె అరుణ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాతాజీ సరస్వతమ్మ, జ్ఞాన చైతన్య, పసుపులేటి వేణుగోపాలస్వామి ఆశీస్సులతో ఆ రోజు ఆధ్యాత్మిక వేత్తలను సప్త రుషులుగా భావించి, పూజించనున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళి మనుగడ



రేపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణతో మానవాళి మనుగడ సాగించగలదని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుజాత అన్నారు. ఓజోన్ డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూలులో శనివారం నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో ఆమె పాల్గొని, మాట్లాడారు. మానవ చర్యలతో ఓజోన్ పొర నానాటికి దెబ్బతింటోందన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని మట్టితో గణనాథుని విగ్రహాలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిచారు. ఉపాధ్యాయులు రాగం మాధవి, నీరజ, కిరణ్మయి, మృత్యుంజయరావు, శ్రీనివాసరావు, వేణుమాధవ్, సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భట్టిప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం



భట్టిప్రోలు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం భట్టిప్రోలు జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు 150 మంది ఎంపిక

భట్టిప్రోలు: స్థానిక కేవీస్కే బాలికల జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 బాలికల విభాగంలో మండలస్థాయి క్రీడా పోటీల్లో 150 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 49 మంది ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను కో–ఆర్డినేటర్ దాసరి వెంకట ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, లక్ష్మి, పీఈటీలు జీవీఎస్ నాగేశ్వరరావు, ఎండీ అనూల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కళాకారుడు శ్రీమన్నారాయణకు అరుదైన గౌరవం



బాపట్ల: బాపట్లకు చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారుడు మహంకాళి శ్రీమన్నారాయణ శనివారం ఉప రాష్ట్రపతి జగదీప్ దన్కర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవం కార్యక్రమం ద్వారా కూచిపూడి నాట్యంలో విశేష సేవలందించిన శ్రీమన్నారాయణకు సంగీత నాటక అకాడమీ అమృత్ అవార్డు ప్రదానం చేశారు. అవార్డుతో పాటు లక్ష రూపాయల నగదు, తామర పత్రం అందించి సత్కరించారు. శ్రీమన్నారాయణ స్థానిక మీడియాతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ అవార్డు తన తండ్రి సత్యనారాయణకు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా ఇళ్ల నిర్మాణం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున


లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

వేమూరు: వీర్వో సంస్థ ద్వారా ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా ఇళ్లు నిర్మించి, ఇవ్వనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ జగనన్న కాలనీ లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని జగనన్న కాలనీ, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామం, చుండూరు మండలం నడిగడ్డ వారి పాలెంలోని కాలనీల్లో ఎస్టీ లబ్ధిదారులకు వీర్వో సంస్థ ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. వేమూరులోని కాలనీలో 97 మంది లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించేందుకు ఈ సంస్థ ముందుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. అక్టోబరు 5న నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సంస్థ ఫాదర్ వేళాంగి రాజు, గృహ నిర్మాణ సంస్థ పీడీ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చొప్పర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం


పారిశుద్ధ్య సామగ్రితో ప్రజా ప్రతినిధులు, అధికారులు

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజ్ ఆధ్వర్యంలో పాఠశాలలకు పారిశుధ్య సామగ్రిని అందజేశారు. ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన పాల దిగుబడికి కృషి చేయాలి

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి హనుమంతరావు

కర్లపాలెం: నాణ్యమైన పాల దిగుబడి కోసం పశు యజమానులు కృషి చేయాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎం.హనుమంతరావు తెలిపారు. మండలంలోని బోలాయపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన దాణా పెట్టటం వలన పాల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. 60శాతం సబ్సిడీలో సంపూర్ణ సమీకృత దాణా అందజేస్తున్నామని తెలిపారు. 40శాతం సబ్సిడీతో ఇచ్చేందుకు చాఫ్‌కటర్‌లు సిద్ధంగా ఉన్నాయని కావలసిన వారు తీసుకోవాలని సూచించారు. పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులకు సకాలంలో వ్యాధి నివారణ టీకాలు వేయించాలని చెప్పారు. అనంతరం బుద్ధాం గ్రామంలో గొర్రెలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఎం.రేచల్ దివ్య, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రాజేష్, పశు సంవర్ధక సహాయకులు రహ్మతున్నీసా, నవీన్, గోపాలమిత్ర శ్రీనివాసాచార్యులు రైతులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో నాగలక్ష్మి

నిజాంపట్నం: ఓజోన్ పొరను రక్షించుకోవాలని ఎంపీడీవో నాగలక్ష్మి అన్నారు. ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా శనివారం ఏజీకేపేట పాఠశాల విద్యార్థులతో ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగలక్ష్మి మాట్లాడుతూ మానవుడు చెట్లను నరికివేయడంతో ఓజోన్ పొర దెబ్బతింటోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అప్పుడే ఆక్సిజన్ అందుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు మోపిదేవి తులసీదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్తరహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దాం


ర్యాలీలో పాల్గొన్న నెహ్రూనికేతన్ ఎండీ మురళీ కాంత్, మున్సిపల్ సిబ్బంది

తెనాలిఅర్బన్: చెత్త రహిత పట్టణంగా తెనాలికి తీర్చిదిద్దేందుకు అందరూ ప్రయత్నించాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ సూచించారు. మినిస్ట్రీస్ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ వారి సూచనల మేరకు ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు మాట్లాడుతూ పట్టణ ప్రజలను, యువతను స్వచ్ఛంద సంస్థలను దీనిలో భాగస్వాములుగా చేయాలని సూచించినట్లు చెప్పారు. మూడుబుట్టల విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు ఎన్.ప్రవీణ్‌కుమార్, డి.సాగరయ్య, ఎం.శాంతి, ప్రియదర్శిని, కె.సంధ్య, జి.చంద్రశేఖర్, వై.నాగమల్లేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, జి.ప్రవీణ కుమారి, పి.శాంతకుమారి, కె.శ్రీనాథ్, కె.సురేష్, నగరదీపికలు పాల్గొన్నారు.

తెనాలిలో 'ఆహా' క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్ ప్రారంభిస్తున్న కమిషనర్ జశ్వంతరావు

తెనాలిఅర్బన్: రోజు వారి కూలీలు, పేద ప్రజలకు ప్రతి రోజూ తక్కువ ధరకే రుచికరమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన రుచి, సుచికరమైన ఆహారాలను ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పేద ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీటీ మిషన్ మేనేజర్ వి.మాధవరావు, సీహెచ్.అరుణకుమారి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

నాక్ ఏర్పాటు విద్యాప్రమాణాల పెంపు కోసమే


వాసిరెడ్డి శివలింగప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: కళాశాలల్లో విద్యాప్రమాణాల పెంపు వాటి ఆవశ్యకతను పెంపొందించి వాటి నాణ్యతకు గుర్తింపు ఇచ్చేందుకు నాక్ ఏర్పాటు చేయబడిందని నాక్ విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ వాసిరెడ్డి శివలింగప్రసాద్ అన్నారు. యూనివర్సిటీ గ్రాండ్ కమీషన్‌చే ఉన్నత విద్యాసంస్థల నాణ్యతస్థితి, ప్రమాణాలకు గుర్తింపు అందించు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) ఆవిర్భావ దినోత్సవంను వీవీఐటీ కళాశాలలో నిర్వహించారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నాక్ విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ వాసిరెడ్డి శివలింగప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో బోధన, పరిశోధనల నాణ్యతల పెంపొందించడం నాక్ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. అధ్యాపకులు నిత్య విద్యార్థులనీ, పరిశోధనలు, ఆధునిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, డీన్ ఫ్రెషమెన్ డాక్టర్ ఎం.రఘురామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

కర్లపాలెం: పొలంలో పూరిపాకా వేసే విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసులు నమోదయ్యాయి. ఎస్‌ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. చింతాయపాలేనికి చెందిన ఎలికా నాగమణి పేరలి గ్రామానికి చెందిన మిక్కిలి మధునూ మరో ఇద్దరిని కూలికి పిలిచి తన పొలంలో పూరిపాక వేయిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఎలికా తిరుపతమ్మ పాకా వేయవద్దని, పొలం వివాదం కోర్టులో ఉందని అడ్డుతగిలారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సముద్ర తీరంలో వ్యర్థాల తొలగింపు


తీరంలో వ్యర్థాలను దృశ్యం

బాపట్ల: మండలంలోని సూర్యలంకలోని సముద్ర తీరంలో అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా ఇన్కయిస్ సంస్థ వ్యర్థాలను తొలగించింది. ఈ సందర్భంగా మత్స్యకార సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంగాని అనిల్ కుమార్ మాట్లాడుతూ తీర ప్రాంతాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆర్.వెంకట శేషు, జి.వెంకటసాయి, మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీ సుదర్శన్ మహాహోమం

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రారంభమైన శ్రీ సుదర్శన్ మహాహోమం కొనసాగుతోంది. ఆలయంలో శనివారం పూర్ణాహుతి, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పూజలు జరిపారు. అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు హోమాన్ని జరుపుతున్నారు. ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి, అర్చకులు ఆర్.కిరణ్‌కుమార్, సురేష్, సెక్రటరీ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్ కుమార్ పంపుల కాలనీకి చెందిన గోరంట్ల సాంబశివరావు(50) గతంలో స్టీలు కంపెనీలో పని చేసేవాడు. కొంత కాలంగా చిన్న టిఫిన్ హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

కొల్లా వెంకయ్య కాలనీ వాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ

సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు


ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని కొల్లా వెంకయ్య కాలనీ వాసుల చిరకాల కోర్కెను ఎమ్మెల్యే కోన రఘుపతి తీర్చారు. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నప్పటికి నివేశన పట్టాలు లేకపోవటంతో ప్రభుత్వ పథకాలు కూడా దరిచేరని నిరుపేదలకు ఆయన అండగా నిలిచారు. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి.. శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించటమే లక్ష్యంగా ముందుకుపోవాలని తమకు సూచించారని తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో 14వేల మందికి పైగా నివేశన స్థలాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పట్టాలు మంజూరుతోపాటు ఆడపడుచులకు చీరలు కూడా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, ఆర్డీఓ రవీంద్రబాబు, తహసీల్దారు సునీత, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

- అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- జేసీ శ్రీధర్‌కు రజక సంఘాల ఐక్యవేదిక నాయకుల వినతి


జేసీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘాల ఐక్యవేదిక నాయకులు

బాపట్ల: రజకుల ఆత్మగౌరవన్ని దెబ్బతీసేలా మాట్లాడిన మహిళలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర రజక సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బాపట్ల రవి కుమార్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఐటీ ఉద్యోగులలో ఓ మహిళ 'చాకలి వెదవల్లా నిందారోపణలు చేశారు.' అని చేసిన వ్యాఖ్యలు రజకులని కించపరిచాయన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజబాబు పిలుపుతో జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌కు అధిక సంఖ్యలో రజకులు శనివారం చేరుకుని, నిరసన వ్యక్తం చేశారు. తమ సామాజిక వర్గాన్ని కించపరిచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పేరాల సురేష్ మాట్లాడుతూ కులాన్ని కించపరుస్తున్న విధానాన్ని ఏబీఎన్‌లో ప్రసారం చేయడం ఎంతో బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమ సామాజిక వర్గాన్ని కించపరిచిన మహిళపై, ఎక్కువ సార్లు ఆ వ్యాఖ్యలు ప్రసారం చేసిన ఏబీఎన్ న్యూస్ చానల్‌పై పట్టణ సీఐకి ఫిర్యాదు చేశారు. అనంతరం స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన వెళ్లారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత ఎమ్మెల్యే కోన రఘుపతిని.. తగిన చర్యలు తీసుకునే విధంగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చేజర్ల సతీష్, న్యాయవాది అంగలకుదురు నటరాజన్, జిల్లా నేతలు ఉప్పలదిన్నె గోపీనాథ్, చేజర్ల మధు, శ్యాము, బాపట్ల రాహుల్, సాయి, గోపీ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, చేజర్ల పాపమ్మ, నాగేశ్వరమ్మ, తిరుమలరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల మార్పుపై తీర్మానం


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మోహనరావు

వేమూరు: పోలింగ్ బూత్‌లు మార్పుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో వేమూరు నియోజక వర్గం ఎన్నికల అధికారి జె.మోహనరావు శనివారం సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వారితో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో నాడు–నేడు అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. దీంతో కొన్ని పోలింగ్ బూత్‌లను మార్చనున్నట్లు తెలిపారు. గత సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తమవడంతో.. ఈ సమావేశం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి వివరించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల మార్పుపై అన్ని పార్టీల ప్రతినిధులు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లిముంత ఏడుకొండలు, గాదె శివరామ కృష్ణారెడ్డి, దండే సుబ్బారావు, దొప్పలపూడి జ్యోతిబాబు, మైనేని మురళీ కృష్ణ, తహసీల్దారు నాగరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.